కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జీపీల ప్రత్యేకాధికారులకు అభివృద్ధి పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి జీపీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వంద శాతం పని దినాలు కల్పించాలన్నారు. గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. నెల రోజుల్లో కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వాడకం తగ్గడం సంతోషించదగిన విషయమన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీపీవో జగదీశ్వర్, డీఎల్‌పీవో సుదర్శన్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ మల్లేశం పాల్గొన్నారు.

12 వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీ..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మొదటి దశ తనిఖీ (ఫస్ట్ లెవెల్ చెకింగ్) నిర్వహణను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంల గోదాములను తనిఖీ చేశారు. 12వ తేదీ వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీని ఈసీఐఎల్ ఇంజినీర్ల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెకింగ్ ముగిసిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించి కంట్రోల్ యూనిట్‌లో వచ్చిన ఓట్ల వివరాలు, వీవీ పాట్‌ల స్లిప్పుల వివరాలను చెక్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో రమేశ్, తహసీల్దార్లు నాగరాజు, బావ్‌సింగ్, జ్యోతి వరలక్ష్మీ దేవి, జగన్మోహన్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాదరావు, రాజకీయ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, కుసుమ శ్యామ్, రజినీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి పాల్గొన్నారు.

నర్సంపేట వైద్య కళాశాలకు వసతులు సమకూర్చాలి

సమీక్షిస్తున్న డైరెక్టర్ విమల థామస్, కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, ఫిబ్రవరి 5: నర్సంపేట ప్రభుత్వ దవాఖానలో వైద్య కళాశాల నిర్వహణకు మౌలిక వసతులు కల్పించాలని మెడికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ విమల థామస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సంపేటలో దవాఖాన నిర్మాణ పనుల పురోగతిని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి సమీక్షించారు. నర్సంపేట జిల్లా దవాఖానలో మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం నిర్వహణకు మౌలిక వసతులను వెంటనే సమకూర్చాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, తరగతులు ఏప్రిల్‌లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవనంలోని మూడు బ్లాకులు కళాశాల కోసం, రెండు బ్లాకులు ఏరియా దవాఖానకు వినియోగించాలన్నారు. సమీక్షలో ఆర్డీవో కృష్ణవేణి, రాష్ట్ర వైద్య సేవలు, వసతుల అభివృద్ధి సంస్థ ఎస్‌ఈ దేవేందర్‌కుమార్, డీఈ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమీకరణ పెంచాలి

ఖిలావరంగల్/కాశీబుగ్గ, ఫిబ్రవరి 5 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీల సమీకరణ పెంచాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యకలాపాలపై అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి డీఆర్డీవో పీడీ సంపత్‌రావు, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీపీవో కల్పన, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈజీఎస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్న వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కాగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఎనుమాముల మార్కెట్ యార్డులో భద్రపరిచిన వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను సోమవారం ఆమె గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ నెల 14 వరకు ఈవీఎంలు, వీవీప్యాడ్‌ల మొదటి దశ తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో వాసుచంద్ర, ఏసీపీ సతీశ్‌బాబు, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాశ్, శ్యామ్, రజినీకాంత్, ఫైజుల్లా అనిల్‌కుమార్, పరంజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి రైల్వే గేట్ రేపటి నుంచి మూసివేత

కాజీపేట, ఫిబ్రవరి 5 : కాజీపేట-హసన్‌పర్తి రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న వడ్డేపల్లి నంబర్ వన్ రైల్వే గేట్‌ను ఈ నెల 7 నుంచి 13 వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడోలైన్ నిర్మాణ పనుల కారణంగా ఉనికిచర్ల మార్గంలోని గేట్‌ను మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, DARAM PURNA CHANDRA RAO, S/o. Ramanaiah, R/o. 1-110/1, Opp. High School, Parvathagiri, Warangal Dist., TS. Changed My Name as DARAM POORNA CHANDAR, S/o. Daram Ramanaiah. NT-311524

★ I, MYSARUP LIVING WATER, S/o. Edward, R/o. 1-6-53/2, Gummunur, Mahabubabad, District TS. Changed My Name as MAYASARAPU LIVING WATER, S/o. Mayasarapu Edward. NT-311524

★ I, GAREPELLI KALPANA, W/o. Venkateshwarlu, R/o. 5-2-55/4, Venkateshwara Bazar, Mahabubabad District, TS. Changed My Name as GARREPALLI KALPANA, W/o. Garrepalli Venkateshwarlu. NT-311524

★ I, GAREPELLI VENKATESHWARLU, S/o. Venkaiah, R/o. 5-2-55/4, Venkateshwara Bazar, Mahabubabad District, TS. Changed My Name as GARREPALLI VENKATESHWARLU, S/o. Garrepalli Venkaiah. NT-311524

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073. NT-319429

WANTED HOSPITAL STAFF

★ GNM నర్సులు, Lab Technicians అనుభవం గలవారు మరియు ఆయమ్మలు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2pm NTW-0344

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

విద్యార్థినుల మృతికి సర్కారుదే బాధ్యత

- ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం అందించాలి
- ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

భవ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం, ఫిబ్రవరి 5: యాదాద్రి భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బుధరావుపేటలో విద్యార్థిని కోడి భవ్య మృతదేహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బాలిక మృతదేహంపై పూలమాలతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పెద్ది మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థినుల మృతిపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. బాలికలు హాస్టల్ గదిలో పక్కపక్కనే ఉరివేసుకోవడం నమ్మశక్యంగా లేదన్నారు. వారి కుటుంబ సభ్యులు రాకముందే మృతదేహాలను అక్కడి నుంచి మార్చురీకి తరలించడమే కాకుండా వారి ఒంటి పై గాయాలు ఉండడం హత్యగా అనుమానించాల్సి వస్తున్నదని పెద్ది అన్నారు. కుటుంబ సభ్యులు నిరసన తెలిపేందుకు యత్నిస్తే వారిని అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌లో బంధించడం చూస్తుంటే ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య అని భావించాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటి వరకు ఎవరిపై కేసు నమోదు చేయకపోవడంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఆయా కుటుంబాల్లోని ఒకరి చొప్పున ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ విషయమై మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి సమస్యను విన్నవించనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం అంత్యక్రియల కోసం పెద్ది భవ్య కుటుంబానికి పెద్ది రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, కాస ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలిక బంధువుల రాస్తారోకో

భవ్య మృతికి కారకులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బంధువులు బుధరావుపేటలో జాతీయ రహదారిపై మృతదేహంతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మృతురాలి బంధువులు శ్రీధర్, రాము మాట్లాడుతూ భవ్య అనారోగ్యంతో మృతి చెందినట్లు సోషల్ మీడియాలో కొందరు పోస్ట్ చేశారన్నారు. భవ్యది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఘటనా స్థలానికి రావాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై మాధవ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. రాస్తారోకోలో కృష్ణ, రమ, వినోద, శ్రీకాంత్, భానుతోపాటు వంద మంది పాల్గొన్నారు.

మార్కెట్‌లో మహిళా రైతుకు గుండెపోటు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓ మహిళా రైతు సోమవారం గుండెపోటుకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామానికి చెందిన సూర రమ, సమ్మయ్య దంపతులు 11 మిర్చి బస్తాలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో మిర్చి యార్డులోనే రమకు గుండెపోటు రావడంతో అస్వస్థతకు గురై బస్తాల మధ్యలో పడిపోయింది. వెంటనే అడ్తి వ్యాపారులు, కార్మికులు మార్కెట్ అధికారులకు సమాచారం అందించారు. వారు 108కు సమాచారం అందించగా మార్కెట్ డిస్పెన్సరీ కంపౌండర్ స్వామి ఆమెకు సీపీఆర్ చేశాడు. అనంతరం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తెగిన కరెంట్ తీగలు.. తప్పిన ప్రమాదం

శాయంపేట,ఫిబ్రవరి 5 : శాయంపేట మండల కేంద్రంలో మైలారం రోడ్డులోని రైస్‌మిల్లు వద్ద లారీకి ప్రధాన విద్యుత్ తీగలు తగిలి తెగిపడ్డాయి. అయితే, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది తీగలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆందోళన చేస్తున్న బాధితులు

పనులు చేసినం.. బిల్లులు ఇవ్వాలి

శాయంపేట, ఫిబ్రవరి 5 : శాయంపేట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి సివిల్ కాంట్రాక్టర్ అని, ఆయన వద్ద వివిధ ప్రాంతాల్లో సబ్‌కాంట్రాక్టు పనులు చేశామని, బిల్లులు ఇవ్వకుండా ఏండ్ల తరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సుమారు 13 మంది బాధితులు తమకు రూ.80లక్షలకుపైగా చెల్లించాల్సి ఉందని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బాలకృష్ణ, ప్రగతిసింగారం గ్రామానికి చెందిన కర్ర సీతారాంరెడ్డి, చిలుకల కొమురయ్య, గాదం చిన్నకొమురయ్య, చిలుకల రాజయ్య, గాదం కొమురయ్య, పెద్దకొమురయ్య, పైడి, మోరె శ్రీనివాస్, బయగాని సాంబలక్ష్మి, నూర్జహాన్‌పల్లికి చెందిన ఎండీ మైనొద్దీన్, తాటికంటి కుమారస్వామి శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు శారీరక దృఢత్వ పరీక్షలు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 5: కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు ఎంజీఎం దవాఖానలో సోమవారం శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించారు. వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ కాజీపేట వెంకటరమణ ఆధ్వర్యంలో కంటి, శారీరక పరీక్షల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్ పరిశీలించి వైద్యులకు సూచనలు చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నర్సంపేటరూరల్, ఫిబ్రవరి 5 : పట్టణంలోని సర్వాపురం శివారులో సోమవారం నర్సంపేట నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. నర్సంపేట గోకా లీలావతి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ గోక స్వప్న-వినోద్‌బాబు, డ్యాగల కిరణ్, మల్లికార్జున్, రవి, శ్యామ్ పాల్గొన్నారు.

ఎల్బీ కాలేజీలో..

హనుమకొండ చౌరస్తా : ఎల్బీ కాలేజీ వార్షిక క్రీడా దినోత్సవం, గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా క్రికెట్ పోటీలను ప్రిన్సిపాల్ అరుణ ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. వారం పాటు కబడ్డీ, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజేందర్‌రెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, శృతి, రజిని, సునీత, అధ్యాపకులు మధుకర్‌రావు, రవీందర్, రాణి, మమత పాల్గొన్నారు.

పార్టీలు మారే చరిత్ర నాది కాదు

- గెలిచినా, ఓడినా ప్రజల పక్షమే..
- రాజకీయంగా ఎదుర్కోలేకే అసత్య ప్రచారాలు
- గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలి
- పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్

మాట్లాడుతున్న అరూరి రమేశ్

న్యూశాయంపేట, ఫిబ్రవరి 5 : పార్టీలు మారే చరిత్ర తనది కాదని, 2012 నుంచి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ కోసం నిరంతరం కష్టపడుతున్నానని, రాజకీయంగా తనను ఎదుర్కోలేని కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అన్నారు. హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, గెలిచినా ఓడినా ప్రజల పక్షాన ఉంటామన్నారు. 2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక 10 ఏళ్లలోనే లక్షా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, రెండు నెలలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేతనాలు వేస్తుందో లేదో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ వల్ల నియామక పత్రాలు ఇవ్వడం ఆలస్యమైందని, అయితే, తామే స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో 50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో వివిధ కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు, రోడ్లు మంజూరు చేయిస్తే వాటిని ఆపాలని చూస్తున్నారన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, విద్యార్థి, నిరుద్యోగం, ఉద్యోగుల సమస్యలపై గలమెత్తే సరైన అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

- గ్రీవెన్స్‌లో నగరవాసుల వినతి
- అర్జీలు స్వీకరించిన బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, ఫిబ్రవరి 5 : కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని బల్దియా గ్రీవెన్స్‌లో బాధితులు కమిషనర్‌కు విన్నవించారు. సోమవారం బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వినతులు స్వీకరించారు. విశ్వకర్మ వసతి భవనం పక్కన నూతన ఇంటి నిర్మాణంలో రోడ్డు పైకి ర్యాంపు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తొలగించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న శ్రీకృష్ణా దవాఖాన యాజమాన్యం గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ అనుమతులకు విరుద్ధంగా ఫార్మసీ కౌంటర్, ఓపీ రూమ్ ఏర్పాటు చేసిందని, దీంతో వాహనాల పార్కింగ్ రోడ్డుపై చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలో రోడ్డు ఆక్రమించుకుని పలు నిర్మాణాలు చేయడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్ లో మొత్తం 81 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, కార్యదర్శి విజయలక్ష్మి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, హెచ్ వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

ఆక్రమణలు, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి

రహదారుల ఆక్రమణలు, తాగునీటి సరఫరాలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో అధికారులతో సమీక్షించారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని అధికారులకు గుర్తు చేశారు. సాధ్యమైనంత త్వరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. పైపులైన్ లీకేజీలను సత్వరమే అరికట్టాలన్నారు.

భద్రకాళీ బండ్ అభివృద్ధి పనుల పరిశీలన..

న్యూశాయంపేట : భద్రకాళీ బండ్ అభివృద్ధి పనులను బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

యువతకు 'అగ్నిపథ్' ఆయుధం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 5 : ఆర్మీలో చేరి దేశ సేవ చేయాలనుకునే యువతకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ ఆయుధం వంటిదని ఎయిర్‌ఫోర్స్ సీనియర్ ఆఫీసర్ రాజేశ్ అన్నారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ధర్మేంద్ర అధ్యక్షతన విద్యార్థులకు అగ్నిపథ్ రిక్రూట్ మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన వారిని అగ్నివీర్‌గా పిలుస్తారన్నారు. ఈ స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం మొదట 45,000 మందిని నియమించుకోనుందని, 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్లలోపు ఉన్న యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోపాల్, కేడీసీ ఎన్‌సీసీ ఆఫీసర్ ఓంకార్ పాల్గొన్నారు.

'మతతత్వ విధానాలపై పోరాడాలి'

నర్సంపేట రూరల్, ఫిబ్రవరి 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు సంఘటితంగా పోరాడాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి పిలుపునిచ్చారు. మాధన్నపేటలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ బంద్ సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కేశెట్టి సదానందం, అనుమాల రమేశ్, గాదగోని బాబు, కేశెట్టి శ్రీనివాస్, వక్కల రాజమౌళి, గుర్రం రవి, ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 5: టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి గుగులోత్ విజయ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాబేటి లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పారునంది లలిత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా టీ శేఖర్, ఎం శుభప్రియ, కోశాధికారిగా ఎన్ రాజు, కార్యదర్శులుగా జీ మదన్‌లాల్, కనకయ్య,వెంకటస్వామి, జిల్లా డెలిగేట్స్‌గా అనిల్, సోమన్న ఎన్నికయ్యారు.

రీసైక్లింగ్‌తో పర్యావరణానికి మేలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5 : రీసైక్లింగ్ విధానంతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని రెడ్డికాలనీ వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగివాణి అన్నారు. ఐటీసీ భాగస్వామ్యంతో నగరంలో రికార్డ్ సర్వీసెస్ సొసైటీ నిర్వహిస్తున్న ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. రికార్డ్ సర్వీస్ సొసైటీ సెంట్రల్ కో ఆర్డినేటర్ కుసుమ కవిత, సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేశ్, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

పరకాల, ఫిబ్రవరి 5 : పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ కోరారు. కళాశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అధ్యాపకులు అరుణ, ఇందిరాదేవి, రాజయ్య, ఓదెలు, అశోక్, రవికుమార్, అనిల్‌కుమార్, రాజశ్రీ, కుమారస్వామి, సుభాషిణి, సంజయ్, స్వప్న, రాజు, శ్యాంసుందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీసుగొండలో ఖోఖో శిక్షణ శిబిరం

గీసుగొండ, ఫిబ్రవరి 5 : గీసుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఈటీ రాంబాబు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 45 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 8 వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఖిలావరంగల్, ఫిబ్రవరి 5 : ఖిలావరంగల్ రోడ్డులోని స్కూల్‌లో ట్రాఫిక్ ఏసీపీ ముక్కెర భోజరాజు విద్యార్థులకు సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన నియమాలను వివరించారు. 10వ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ముక్కెర రవీందర్, ట్రాఫిక్ సీఐ వెంకన్న పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఖానాపురం, ఫిబ్రవరి 5 : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై మాధవ్‌గౌడ్ సూచించారు. సోమవారం బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దామెర రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

'బొడ్రాయి' పోస్టర్ల ఆవిష్కరణ

గిర్మాజీపేట, ఫిబ్రవరి 5 : ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో ఏప్రిల్ ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు, కరీమాబాద్ లక్ష్మీనగర్‌లో ఏప్రిల్ 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవ పోస్టర్లను తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పెద్ది స్వప్న పరామర్శ

చెన్నారావుపేట, ఫిబ్రవరి 5: చెన్నారావుపేట కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాదు నర్సింగరావు సోదరుడు చిరంజీవి ఇటీవల మృతి చెందగా, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చిరంజీవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె వెంట జడ్పీటీసీ పత్తినాయక్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రఫీ, మండల మాజీ అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు నర్మెట్ట సాంబయ్య, శ్రీను, యాకయ్య, నవీన్ ఉన్నారు.

'చలివాగు' పనులపై ఇరిగేషన్ ఈఈకి లేఖ

శాయంపేట, ఫిబ్రవరి 5 : మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు మరమ్మతులు ప్రారంభం కాకపోవడంతో ఈఈకి లేఖ రాసినట్లు ఇరిగేషన్ శాఖ డీఈ గిరిధర్ చెప్పారు. గత ప్రభుత్వం చలివాగు ప్రాజెక్టు మరమ్మతులకు రూ.10.30 కోట్లను మంజూరు చేసిందన్నారు. టెండర్లు పూర్తయి మూడు నెలలు దాటినా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదని తెలిపారు. దీంతో రైతులు నిలదీస్తున్నారన్నారు. ఈ క్రమంలో మరమ్మతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఈఈకి లేఖ రాసినట్లు చెప్పారు.

'చైతన్య' యూజీ, పీజీ సెమిస్టర్ ఫలితాలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5 : హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య(డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం) యూజీ 3, 5, పీజీ 3, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్, ఎంఫార్మసీ-3 సెమిస్టర్ ఫలితాలను కులపతి సీహెచ్‌వీ పురుషోత్తమ్‌రెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 969 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 743 మంది ఉత్తీర్ణులయ్యారని(76.67 శాతం), పీజీ 3 సెమిస్టర్లలో మొత్తం 234కు 203 ఉత్తీర్ణులైనట్లు(86.75), బీటెక్, బీఫార్మసీ-3, 5వ సెమిస్టర్లలో 591కి 432 ఉత్తీర్ణులైనట్లు(73.09), ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో ఆరుగురికి ఆరుగురు, ఎంఫార్మసీ 3 సెమిస్టర్‌లో 15కి 15 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ శంకర్‌లింగం, ఫార్మసీ డీన్ మల్లికార్జున్, ఓఎస్డీ వీరవెంకటయ్య, అడ్మినిస్ట్రేషన్ డీన్ కవిత, అడ్మిషన్స్ డీన్ సుమ, పరీక్షల నియంత్రణాధికారి జగదీశ్వర్ తెలిపారు.

వనదేవతలను దర్శించుకున్న సీపీ

సమ్మక్క గద్దెను దర్శించుకుంటున్న సీపీ

తాడ్వాయి, ఫిబ్రవరి 5 : మేడారం సమ్మక్క, సారలమ్మలను సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన ఆయనకు ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గద్దెలపై సీపీ పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల పూజారులు, దేవాదాయశాఖ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం జాతర బందోబస్తుపై పోలీసు అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు.

'మిర్చికి రూ. 30 వేల ధర చెల్లించాలి'

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5 : క్వింటాల్ మిర్చికి రూ.30 ధర చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం ప్రతినిధి రిటైర్డ్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మిర్చి యార్డును సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో ఆశించిన ధర రాకపోడంతో రైతులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినిధులు కాసర్ల రాంరెడ్డి, సోమ రామ్మూర్తి, ఊరటి అంశాలరెడ్డి, మోకిడి పీరయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రజావాణిలో 76 వినతుల స్వీకరణ

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5 : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అదనపు కలెక్టర్ రాధికకాగుప్తా, డీఆర్వో వైవీ గణేశ్ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా ప్రజలు వివిధ సమస్యలపై 76 వినతులు అందజేశారు. జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డీపీవో జగదీశ్వర్ పాల్గొన్నారు.

కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు

కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబుపై కేయూ విద్యార్థి సంఘాల నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అశోక్‌బాబు యూనివర్సిటీ భూమి సర్వేనంబర్ 229లోనే ఇండ్లు కట్టుకున్నట్లు తేలడంతో ల్యాండ్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, ప్రొఫెసర్ మనోహర్, నాగేంద్రబాబు 2022 నవంబర్‌లోనే పాలక మండలి చైర్మన్ వీసీ రమేశ్‌కు నివేదిక సమర్పించినా చర్యలు తీసుకోవట్లేదని ఫిర్యాదులో వెల్లడించారు. యూనివర్సిటీ భూములను కబ్జాచేసిన అశోక్‌బాబు సహా నోటీసులు ఇచ్చిన మిగతా 12 మందిపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టాలని హనుమకొండ ఆర్డీవోకు అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఆదేశాలు జారీ చేశారు.

బహుమతుల ప్రదానంలో జిల్లాకు చెందిన విద్యార్థులు

అంతర్జాతీయస్థాయి అలామ అబాకస్ బహుమతుల ప్రదానం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5: అంతర్జాతీయస్థాయి అలామ అబాకస్ బహుమతుల ప్రదానోత్సవం సికింద్రాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్‌లో జనవరి 28న నిర్వహించారు. వరంగల్, హనుమకొండ నగరానికి చెందిన అనేక మంది విద్యార్థులు 1-6 లెవెల్స్‌లో పాల్గొని వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారు. విదీజ్ఞ లెవల్-2 జూనియర్ కేటగిరీలో ప్రథమ బహుమతితో చాంపియన్ ట్రోఫీ గెలుచుకుంది. రణవీత్‌రెడ్డి లెవల్-1 విభాగంలో ప్రథమ బహుమతి, గీతికసాయి లెవల్-1 సీనియర్ కేటగిరీలో ద్వితీయ బహుమతి గెలుచుకోగా, కృతికారెడ్డి లెవల్-4 విభాగంలో సీనియర్ కేటగిరీ నుంచి లక్ష్మీతేజ ద్వితీయ, లెవల్-6లో హవీష్ జాదవ్‌తోపాటు శ్రీహిత, మహిత్, దేవాన్ష్, ఆదిత్య, అభిజ్ఞ, సంహిత, వర్షిని, నేస్త, యజ్ఞవలేఖ్య, హశ్విక, స్వాతి, వైష్ణోప్రియా తదితర విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. అలామ అబాకస్ డైరెక్టర్ ముత్తుకుమార్, డాక్టర్ రాజీవ్ శ్రీవాత్సవ్, నరేశ్ గుప్తా బహుమతులు అందజేశారు. టీచర్లు శ్రీలేఖ, శిల్పా, సునీత పాల్గొన్నారు. దేశవిదేశాల నుంచి 1500 పైగా పిల్లలు 7 నిమిషాల ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్నారు.